శాంతి భద్రతల పరిష్కరణకు కృషి చేయాలి

ఎస్పీ రాజేశ్‌చంద్రకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ సత్యనారాయణగౌడ్

బాన్సువాడ, మార్చి 12 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. బాన్సువాడలోని డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీకి డీఎస్పీ సత్య నారాయణ గౌడ్, సీఐ, ఎస్సైలు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ స్థాయి పోలీస్ సిబ్బందితో సమీక్షించారు. ఆయా మండలాల కేసుల స్థితిగతులు, సీసీ కెమెరాల పనితీరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ అశోక్, రూరల్ సీఐ రాజేశ్, ఎస్సై లావణ్య, మోహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పగడ్డ' పరిరక్షణ అందరి బాధ్యత

పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బీబీపేట్(దోమకొండ), మార్చి 12: దోమకొండలోని ఉప్పగడ్డ చారిత్రాత్మక వారసత్వ సంపద అని.. దీనిని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దోమకొండలోని గ్రామ పంచాయతీ ద్వారా ఉప్పగడ్డ పరిరక్షణకు ఇచ్చిన అనుమతి ప్రకారం పనులు ఎంత వరకు పూర్తయ్యాయని తెలుసుకున్నారు. బుధవారం ఉప్పగడ్డ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, మహిళా సంఘం సభ్యులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విద్యార్థులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

నస్రుల్లాబాద్, మార్చి 12 : మండలంలోని నెమ్లి ప్రాథమిక పాఠశాలలో బాన్సువాడ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎత్తు, బరువు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో చందర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

బీబీపేట్, మార్చి 12: మండలంలోని ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు యాదగిరి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రం

- మల్కాపూర్, జనగామ గ్రామాల్లో ఏర్పాటు చేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు
- మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేయని 56 కెమెరాలు

బీబీపేట్, మార్చి 12: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం.. ఎన్నో కేసుల్లో నిందితులను సీసీ పుటేజీల ద్వారానే పట్టుకున్నాం.. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పలు సమావేశాల్లో పోలీసులు పదేపదే చేప్పే మాటలావి. కానీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. పోలీసుల నిర్లక్ష్యంతో ఉన్న సీసీ కెమెరాలను కూడా రిపేర్ చేయించడం లేదని మండల ప్రజ లు ఆరోపిస్తున్నారు. బీబీపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పోలీసులు మాత్రం సీసీ కెమెరా మరమ్మతు విషయంలో తమకేం పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారు. బీబీపేటలో దాదాపు ఆరు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. మాందాపూర్‌లో ఐదు, కోనాపూర్ నాలుగు. తుజాల్‌పూర్ 15, యాడారం 12, శివారు రాంరెడ్డిపల్లి నాలుగు, ఉప్పర్‌పల్లిలో నాలుగు, ఇస్సానగర్‌లో ఆరు సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. మల్కాపూర్, జనగామలో ఇప్పటి వరకు కూడా సీసీ కెమెరాలు లేవు. కొన్ని చోట్ల ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిబట్టి చూస్తే బీబీపేట పోలీస్ స్టేషన్‌లో ఉన్న అధికారి ఏవిధంగా పనిచేస్తున్నారో తెలుస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయాలని, మరికొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. బీబీపేట నుంచి దుబ్బాక, సిద్దిపేట, నస్కల్, కామారెడ్డికి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏదైనా ఘటనలు జరిగితే సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన చిత్రాలు కీలకం కానున్నాయి. అలాంటి వాటి పనితీరును అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై భిక్కనూర్ సీఐ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా బీబీపేట మండలంలో పనిచేయని సీసీ కెమెరాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాత వాటికి మరమ్మతులు చేయిస్తామని, త్వరలో అన్ని కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోనాపూర్ గ్రామంలో పనిచేయని సీసీ కెమెరా

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలి

రెండో రోజు నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కామారెడ్డి, మార్చి 12 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను అమలు చేస్తానని మాట ఇచ్చారని ఆ మాటను నిలబెట్టుకోవాలన్నారు. మాలలకు తొత్తుగా పనిచేస్తూ గ్రూప్–1, 2, 3 నియామకాలకు ఆదేశిస్తూ వర్గీకరణను ఆపి వేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు యాదగిరి, సాయిలు, బాల్‌రాజు గౌడ్, సుజాత, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

కామారెడ్డి, మార్చి 12 : విద్యారంగం కోసం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 15 నెలల వ్యవధిలో 83 మంది పేద పిల్లలు మరణించారని, అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడట్లేదని అన్నారు. సమావేశంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్, టౌన్ సెక్రటరీ సంతోష్, ధన్‌రాజ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటిఅద్దాల అందజేత

విద్యార్థులకు కండ్ల అద్దాలను అందజేస్తున్న ప్రత్యేకాధికారిణి గీత

నస్రుల్లాబాద్, మార్చి 12 : బీర్కూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి అద్దాలను బుధవారం పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సంతోష్, డాక్టర్ మమత తెలిపారు. ఇటీవల జిల్లా దవాఖానలో కలెక్టర్ ఆదేశాల మేరకు కంటి వైద్య శిబిరాలను నిర్వహించామని, కంటి చూపు మందగిం చిన విద్యార్థులకు అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బీబీపేట్(దోమకొండ), మార్చి 12 : దోమకొండలోని ఎస్సీ హాస్టల్ ఎదుట శ్రీ ఆంజనేయ యూత్ క్లబ్, గణేశ్ మండలి సభ్యులు కలిసి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో శ్రీఆంజనేయ యూత్ క్లబ్, గణేశ్ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీపేట్(దోమకొండ), మార్చి 12 : దోమకొండ మండలం అంచనూర్ గ్రామానికి చెందిన కుంటి రాజవ్వ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుంటి రాజవ్వ మంగళవారం ఇంటికి తాళం వేసి ఇంటి ఆవరణలో ఉన్న వంట గదిలో తాళంచెవి పెట్టింది. మాందాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి సూట్‌కేస్‌లో ఉన్న రూ.65 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం..

దోమకొండకు చెందిన రావులపల్లి సంతోష్‌రెడ్డి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఎస్సై స్రవంతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్‌రెడ్డి దోమకొండ శివారులో ఉన్న తన పొలం వద్దకు మంగళవారం రాత్రి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై వెళ్లాడు. పొలం దగ్గర పార్క్ చేశాడు. బుధవారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దోమకొండ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ రూరల్, మార్చి 12 : బాన్సువాడ మండలం బుడ్మి గ్రామ శివారులోని మంజీరా నది ఒడ్డున హరిహర దేవి ఆలయ నిర్మాణానికి బుధవారం గురుమాదానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామితో కలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి భూమిపూజ చేశారు. బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బుడ్మి సొసైటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 12 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం మొత్తం 38 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ పేపర్–2కు మొత్తం జనరల్ 7,505 మందికి 7,351 మంది హాజరుకాగా 154 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్‌లో 990 మందికిగాను 937 మంది హాజరుకాగా 53 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

19న జిల్లా స్థాయి ఎంపికలు

కామారెడ్డి, మార్చి 12 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఇందిరాగాంధీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి (అండర్–14, 16, 18, 20) బాయ్స్ అండ్ గర్ల్స్, మెన్ అండ్ ఉమెన్‌కు 100, 400, జావలిన్ త్రోలో ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే వారు ఎస్సెస్సీ జిరాక్స్, వయస్సు ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కామారెడ్డి, మార్చి 12 : జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ట్రాఫిక్ రూల్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడుపొద్దని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మహేశ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి, మార్చి 12 : పాల్వంచ మండలం భవానీపేట గ్రామానికి చెందిన మంద నారాయణ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.

పోచారం శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

నాగిరెడ్డిపేట, మార్చి12: మండలంలోని పోచారం శివారు ఎర్రకుంట సమీపంలో రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు ట్రాన్స్‌కో డీఈ విజయసారథి తెలిపారు. శివారులోని ఎస్ఎస్25, ఎస్ఎస్26, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాను తొలగించి కాపర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. రైతుల సమాచారం మేరకు వెళ్లి పరిశీలించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అవగాహన ఉన్న వాళ్లే చోరీకి పాల్పడుతున్నారని, రూ.2 లక్షల నష్టం జరిగిందన్నారు. రెండు రోజుల క్రితం ధర్మారెడ్డి శివారులో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్, ఆయిల్ చోరీ చేసినట్లు తెలిపారు. చోరీ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, రాత్రి వేళ పెట్రోలింగ్ చేపట్టాలని పోలీసులను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

రైతులు ట్రాన్స్‌కో అనుమతులు లేకుండా పనులు చేయొద్దు..

మాల్తుమ్మెద గ్రామశివారులో రైతులతో మాట్లాడుతున్న డీఈఈ విజయ సారథి

నాగిరెడ్డిపేట, మార్చి12: రైతులు ట్రాన్స్‌కో సిబ్బంది అనుమతులు తీసుకోకుండా ఎలాంటి విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టవద్దని ట్రాన్స్‌కో డీఈ విజయసారథి సూచించారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులతో కలిసి విద్యుత్ శాఖ, రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, ఎస్ఎల్ఐ సత్యనారాయణ, లైన్ ఇన్‌స్పెక్టర్లు సురేందర్ నూరియా, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

దొరికిన కిలాడీ

- వృద్ధురాలి కండ్లల్లో కారం చల్లి నాలుగు తులాల బంగారు ఆభరణాల అపహరణ
- 48 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 12: అమాయకమైన వృద్ధురాలికి మాయమాటలు చెప్పి కండ్లలో కారం కొట్టి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, బంగారు గుండ్లు దొంగిలించిన కిలాడీ లేడీని ఎల్లారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. ఫిర్యాదు చేసిన 48 గంటల్లోనే కేసును ఛేదించి నిందితురాలి నుంచి సొత్తును రికవరీ చేశారు. సీఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన కాశవ్వ (70) ఈనెల 9న పట్టణంలో జరిగిన వారాంతపు సంతకు వచ్చింది. కూరగాయలు కొనుక్కొని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గ్రామానికి ఆటోలో వెళ్లేందుకు బస్టాండుకు వచ్చింది. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఏశవ్వ అనే కిలాడీ లేడీ వృద్ధురాలిని గమనించి ఆమె వెనకాలే బస్టాండుకు చేరుకుని కాశవ్వతో మాటలు కలిపింది. దేవునిపల్లి గ్రామానికి వెళ్లాలంటే అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటోలు ఉంటాయని, తాను కూడా అటువైపే వెళ్తున్నానని నమ్మించింది. ఏశవ్వను నమ్మిన కాశవ్వ ఆమెతో కలిసి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నది. అక్కడే ఉన్న సీఎస్ఐ చర్చి వెనకాల నుంచి వెళితే చాలా దగ్గరవుతుందని, ఆటో కూడా అవసరం లేదని ఏశవ్వ వృద్ధురాలికి నచ్చజెప్పింది. ఆమె మాటలు నమ్మిన వృద్ధురాలు ఏశవ్వతో పాటు నడుస్తూ చర్చి వెనకాలకు చేరుకున్నారు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కారంపొడిని ఏశవ్వ వృద్ధురాలి కండ్లలో చల్లింది. తేరుకునే లోపు ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు, తులంన్నర బంగారు గుండ్లను తెంపుకొని పారిపోయింది. తేరుకున్న వృద్ధురాలు అరవడంతో స్థానికులు గమనించి ఆమెను ఇంటికి చేర్చారు. కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపి 48 గంటల్లో నిందితురాలిని స్థానిక కూరగాయల మార్కెట్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఏశవ్వను విచారించగా బంగారు పుస్తెలతాడు సంగారెడ్డి జిల్లా శంకరంపేటలో కుదువ పెట్టిందని, ముందస్తుగా 10వేల రూపాయలను తీసుకున్నదని సీఐ తెలిపారు. నిందితురాలిని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టి, ఆమె దొంగిలించిన బంగారు పుస్తెలతాడు, 10వేల రూపాయలను పోలీసులు ప్రదర్శించారు. ఏశవ్వను స్థానిక కోర్టులో హాజరుపరుచనున్నట్లు సీఐ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాలు, గృహాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలని ఈ సందర్భంగా సీఐ ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్సై బొజ్జ మహేందర్, ఏఎస్సై గంగారెడ్డి, సిబ్బంది అనిల్‌గౌడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గాంధారి, మార్చి 12: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ చంద్రసిర్వీ తెలిపారు. జిల్లా కేంద్రంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఆర్. రోహిత్, కె. కార్తీక్ అనే విద్యార్థులు పాల్గొని మొదటి బహుమతి సాధించినట్లు చెప్పారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలతో పాటు ఏడు వేల రూపాయల నగదు బహుమతి అందజేశారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి

లింగంపేట, మార్చి12: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో నరేశ్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో మల్హరీ, ఏపీవో నరేందర్ పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల సీజ్

నిజాంసాగర్, మార్చి 12 : మండలంలోని అచ్చంపేట పంచాయతీ పరిధిలోని మరుపల్లిలో ఇసుక డంప్‌లను అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక డంప్ చేశారనే సమాచారం మేరకు బుధవారం ఆర్ఐ సాయిబాబా ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. అనుమతి లేకుండా 18 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేశారని గుర్తించి, సీజ్ చేశామని అధికారులు తెలిపారు. అదే ప్రాంతంలో మరిన్ని ఇసుక నిల్వలు ఉన్నాయని, వాటిని సీజ్ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పరిశీలన

పెద్ద కొడప్‌గల్, మార్చి 7 : పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను ఎంఈవో దేవీసింగ్ పరిశీలించారు. పిట్లం మండలంలోని గౌరారం పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్య స్థాయి సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో హెల్ప్ లైన్ నంబర్లు డిస్ ప్లే అయ్యే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సంధ్యారాణి, ధనుంజయ్, ఇన్విజిలేటర్ జగదీశ్, సీఆర్పీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్నూర్, మార్చి12: మండలంలోని మేనూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. 10 లక్షల రూపాయల నిధులు మంజురుకావడంతో పనులు ప్రారంభించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, ప్రజ్ఞకుమార్, కొండ గంగాధర్, మొయిన్‌పటేల్, గోపి, అమూల్, రవి, దత్తు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లింగంపేట, మార్చి12: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పోల్కంపేట గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ఎంపీడీవో వెంట ప్రిన్సిపాల్ వెంకటరాములు, పోల్కంపేట గ్రామ కార్యదర్శి అశ్వక్ తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/s Shriram Finance Ltd,** Branch: BANSWADA had agreed to accord Loan to **Palthya Swapna** W/o Kethavath Gopal, Age 28 Yrs, Occ:Business, R/o H.No.5-43, Lingampally Thanda (V) Nasrullabad (M), Kamareddy (Dist) by mortgage of the schedule referred property of **Kethavath Gopal S/o Kethavath Hatya.** The above prospective Loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

That the RCC Roofed House bearing H.No.5-10/2 admeasuring 289.33 Sq.Yds out of which RCC roofed Plinth area 1147.00 Sq.Fts situated at Lingampally Thanda Village of Nasrullabad Mandal, Kamareddy District, within the limits of Gram Panchayat Lingampally Thanda, under the jurisdiction of Regn.Sub Dist Banswada and Dist.Regn.Nizamabad Assessment No.73.

Bounded as: East : Land of Sabavath Mounika ,West : P.A.C.S Godam ,North : Canal ,South : R & B Road

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

THE NIZAMABAD DISTRICT CO.OPERATIVE CENTRAL BANK LTD. MACHAREDDY, DIST: NIZAMABAD

ప్రకటన Dt: 12.03.2025

శ్రీ ముత్యాల కుల్దీప్ తండ్రి శంకర్ ముత్యాల, వయస్సు: 36, వృత్తి: వ్యవసాయం, నివాసం: గ్రా॥లచ్చపేట్, మం॥మాచారెడ్డి, జి॥కామారెడ్డి సర్వే నెం.(258/1A/1) డాక్యుమెంట్ నెం.1233/ 2015 విస్తీర్ణం: 2 ఎకరాల 10 గుంటలు కర్షకమిత్రలోను కొరకు జతపరచిన ప్రకారం North: Jakkula Yellaiah, South: Busa Yadhagiri, East: Busa Mallesham, West: Lachapeta Cheruvu. ఇట్టి యాజమాని అయ్యి ఉండి సంపూర్ణ స్వాధీనంతో భూమి కలదు. కర్షకమిత్ర లోన్ కొరకు NDCCB బ్యాంకు బ్రాంచ్ మాచారెడ్డి వారి వద్ద తనఖా పెట్టుచున్నాను. కావున ఎవరికైన ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేగలరు.

సం/– NDCCB బ్యాంకు మేనేజర్ B.Sushmitha

బీమా చెక్కు పంపిణీ

లింగంపేట, మార్చి 12: మండలంలోని కొయ్యగుండుతండాకు చెందిన కేతావత్ అంజికి లక్ష రూపాయల చెక్కును బుధవారం నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు జీఎం లింబాద్రి పంపిణీ చేశారు. అంజి భర్త స్థానిక సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉండి ఇటీవల మృతి చెందాడు. బీమా డబ్బులు మంజూరు కావడంతో మండల కేంద్రంలో ని సహకార సంఘం కార్యాలయంలో కిషన్ భార్య అంజికి అందజేశారు. కార్యక్రమంలో లింగంపేట సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, సీఈవో పెంటయ్య, శెట్పల్లిసంగారెడ్డి సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, నల్లమడుగు సహకార సంఘ సీఈవో మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులు ఆర్థికంగా ఎదగాలి


మత్స్యకార్మికుల వృత్తి నైపుణ్య పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి

లింగంపేట, మార్చి12: మత్స్యకార్మికులు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా మత్స్య పరిశ్రమ శాఖ అధికారి శ్రీపతి సూచించారు. మండలంలోని బాయంపల్లి గ్రామంలో బుధవారం మత్స్యకార్మికుల వృతి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పటేల్ చెరువులో 18 మంది మత్స్య కార్మికులతో వల విసరడం, ఈత కొట్టడం, పాంగ్రి లాగడం వంటి వృత్తి నైపుణ్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నూతనంగా ఏర్పాటు చేసిన సొసైటీని కలిసి కట్టుగా ముందుకు తీసుకువెళ్లాలని, కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. మత్స్యకార్మికులకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రమిక సంఘ చైర్మన్ గాదం సత్యనారాయణ, ఆడిటర్ శ్రీనివాస్, జిల్లా డైరెక్టర్ బెస్త సాయిలు, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు దాసరి సాయిలు, ఫీల్డ్ అధికారి సురేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పచ్చుంటి సాయిలు, రవీందర్, శ్రీనివాస్, సంతోష్, రాజు, సాయిలు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 12: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిండు శాసనసభలో మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణతల్లి ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం నిరసన దీక్షలను ప్రారంభించి వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3తో పాటు అన్నిరకాల ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని, ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారికి వికలాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకుడు పద్మారావు, మండల అధ్యక్షుడు శివానందం, ఉపాధ్యక్షుడు మానయ్య, నాయకులు పోలు, సామెల్ తదితరులు పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


గాంధారి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

గాంధారి,మార్చి 12: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఎస్సైకి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన పరిసరాలతో పాటు, స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ పక్కన నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వాటర్స్ రూంలను పరిశీలించిన ఆయన వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

గోలిలింగాల పాఠశాలలో స్వయం పాలన

నాగిరెడ్డిపేట, మార్చి12: మండలంలోని గోలిలింగాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారి బోధనా తీరు, క్రమశిక్షణను హెచ్ఎం దేవయ్య పర్యవేక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

నిజాంసాగర్, మార్చి 12 : మహ్మద్‌నగర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో అమర్‌సింగ్, హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.